క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్ ఫీడర్‌లోని విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆర్ట్స్ కళాశాల ఫీడర్‌లోని శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

17న కామర్స్ టాలెంట్ టెస్ట్

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఈనెల 17న కామర్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ దత్తాత్రేయులు తెలిపారు. ఈ పరీక్షలో వాణిజ్యం, అకౌంటింగ్, ఎకనామిక్స్, కరెంట్ అఫైర్స్‌లలో 100 బహుళ, ఎంపిక ప్రశ్నలు ఉంటాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు రూ.20 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 98499 40092, 98499 40092 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని దత్తాత్రేయులు కోరారు.

ఆరోపణలు మానుకోవాలి

ఖిలా వరంగల్: అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకోవాలని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చూస్తోందని, ఇలాంటి ఆరోపణలను వెంటనే మానుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. శివనగర్‌లోని స్వగృహంలో ఆయన బుధవారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ సమాజం లేదని ఆయన తెలిపారు.

డీజీపీకి ధనమైసమ్మ చిత్రపటం బహూకరణ



ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డిని హెడ్ కానిస్టేబుల్, శివనగర్ ధనమైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోట బాబన్న బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి ధనమైసమ్మ చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రతినిధులు పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, బిల్ల రాజు, బజ్జూరి అంజయ్య తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులు



తేజస్విని



శ్రీకాంత్

హనుమకొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కందుకూరి అజయ్ – సుమలత దంపతులు కూలీపనులు చేసుకుంటూ తమ కుమారుడు శ్రీకాంత్‌ను సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివించారు. శ్రీకాంత్ నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు, అదేవిధంగా రాంపూర్ గ్రామానికి చెందిన కందుకూరి సురేష్ – అన్నపూర్ణ దంపతుల కుమార్తె తేజస్విని ధర్మసాగర్ గురుకులంలో చదివి, వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సాధించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పలువురు అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



పరకాల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి క్రీడోత్సవాలు జరిగాయి. ఈ క్రీడలకు ఆయన హాజరై విద్యార్థులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని అన్నారు. అప్పుడే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే శక్తివంతులుగా తయారవుతారని అన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. ఎంఈఓ రమాదేవి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మధు, సురేందర్, ఎఫ్ఏసీ హెచ్ఎంపీ భాస్కర్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబయ్య, పీడీ, పీఈటీలు శ్యామ్, రజిత, వినయ్, సుధీర్, రాజు, శ్రీకాంత్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్
- ఈనెల 14 దరఖాస్తుకు తుది గడువు
- డిసెంబర్ 7న ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష
- 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు

కాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున రూ.48 వేలు అందజేస్తారు. అయితే, ఇంటర్ విద్యను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాల్సి ఉంటుంది. వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వరు. డే స్కాలర్‌గా ఉన్న విద్యార్థులకు మాత్రమే ఈ సదుపాయం కల్పిస్తారు.

పేద విద్యార్థులకు భరోసా

కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఏటా పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని 2008 -09లో ప్రవేశపెట్టారు. ఇది పేద విద్యార్థుల విద్యకు భరోసా కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్‌ను నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలోనే జమచేస్తారు. పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో చదివే వారికి మాత్రమే స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు. ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే వారికి స్కాలర్‌షిప్ ఇవ్వరు. కాగా, ప్రతియేటా హనుమకొండ జిల్లా నుంచి వందలాది మంది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికవుతున్నారు.

డిసెంబర్ 7న అర్హత పరీక్ష

పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబర్ 7న అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు అర్హులు. ఆబ్జెక్టివ్ విధానంలో 180 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిషు ఉండగా, మరో 90 మార్కులకు 7, 8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం కేటాయిస్తారు. జిల్లా ప్రాతిపదికగా స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.



అర్హతలివే..

ప్రస్తుతం ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యాలు లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 14 చివరి తేదీ కాగా, పరీక్ష రుసుం చెల్లించేందుకు 15వ తేదీ తుది గడువు.

ఘనంగా పోషణ మాసం వేడుకలు



సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ ప్రాజెక్ట్‌లోని వడ్డేపల్లి సెక్టార్‌లోని 58, 60వ డివిజన్లలో కుమ్మరివాడ, ఏనుగుల గడ్డ -2 అంగన్‌వాడీ కేంద్రాల్లో డివిజనల్ స్థాయి పోషణ మాసం వేడుకలను బుధవారం నిర్వహించారు. డీడబ్ల్యూఓ జయంతి పాల్గొని వేయి రోజుల ప్రాముఖ్యత, పౌష్టికాహార ప్రాధాన్యం, పోషణ, శుభ్రత పద్ధతులు, వాష్ (నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత) ప్రాముఖ్యతలను గర్భిణులు, బాలింతలు, మహిళలకు వివరించారు. అనంతరం సామూహిక అన్నప్రసాదం, సీమంతాలు నిర్వహించి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ విశ్వజ, సూపర్‌వైజర్లు రమాదేవి, విజయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న రాజమణి

పిల్లలకు ఆటపాటలతో విద్యనందించాలి

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యనందించాలని డీడబ్ల్యూఓ రాజమణి, సీడీపీఓ విద్య సూచించారు. పోషణమాసం సందర్భంగా 37వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణపై బుధవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుధ, సూపర్‌వైజర్ కళ్యాణి, ఏఎన్ఎం ఎలిజబెత్, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, స్వర్ణలత, వహెదా, రాజమణి, శారద, తదితరులు పాల్గొన్నారు.

శరీర దానానికి ముందుకు రావాలి



బాలకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కాజీపేట అర్బన్: మరణానంతరం శరీర దానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన సెయింట్ జార్జ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్‌కె.బాలకృష్ణ తన మరణాంతరం పార్థివ దేహాన్ని కేఎంసీకి అందజేస్తానని అంగీకరించారు. ఈ మేరకు కేఎంసీ, సదాశయ ఫౌండేషన్ అందజేసిన పత్రాలను తన కార్యాలయంలో బాలకృష్ణకు ఎమ్మెల్యే బుధవారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, పాల కుమారస్వామి, దళపతి పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే ప్రజలకు రక్ష

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో పనాస ప్రసాద్ అధ్యక్షతన పార్టీ జిల్లా సమితి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో రానున్న రోజుల్లో కమ్యూనిస్టులకే భవిష్యత్ ఉంటుందని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీపీఐ ఉద్యమిస్తోందని గుర్తుచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి ప్రజాతంత్ర శక్తుల గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ బాష్‌మియా, మేకల రవి, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, భద్రి, ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్: మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను బుధవారం దహనానికి యత్నించగా, కేయూ పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి అనంతరం వదిలివేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో దళితుల ఓట్లతో గెలిచిన మంత్రి పొన్నం ప్రభాకర్.. దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు అర్షం చరణ్, నందు, పవన్‌రాజు, అఖిల్, కిరణ్, సాయి, వెంకటేష్, సూర్యవిజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్



కాంగ్రెస్ బాకీ కార్డుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్, ఆటో కార్మికులు

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్


కాజీపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. కాజీపేట రైల్వే జంక్షన్ ఆటో అడ్డా వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డులను బుధవారం ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వృద్ధులు, విద్యార్థులు, మహిళలు, వికలాంగులు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా రైల్వే బస్టాప్‌లో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థినులతో వినయ్‌భాస్కర్ కొద్దిసేపు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కూటీలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గడ్డం నరహరి, ఎం.నర్సింహ, పి.సంతు, బొక్క స్వామి, శంకర్‌నాయక్, పి.రవీందర్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవానికి రావాలి

పరకాల : వచ్చే నెల 3న కార్తీక మాసోత్సవం సందర్భంగా శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహారుద్రయాగ మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పరకాల ఏసీపీ సతీశ్ బాబు బుధవారం ఆవిష్కరించారు. లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చాలా అవసరమని, భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. పరకాల సీఐ క్రాంతికుమార్, దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు, మహారుద్రయాగ సమితి అధ్యక్షుడు లక్ష్మణ్, కన్వీనర్ రవి, కో కన్వీనర్ అశోక్, కోశాధికారి భద్రయ్య, ఆలయ ధర్మకర్తలు రవి, నవీన్, సత్యం, సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

రామన్నపేట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ భూజేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల ముగింపు సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌పై అవగాహన, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా జీవించవచ్చని వివరించారు. ఈ విషయంపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు.



ఆవరణలో చెత్తను తొలగిస్తున్న వలంటీర్లు

కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గోపి, సీనియర్ వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, సాత్విక్, నవ్య, ఉదయశ్రీ, మిన్ను, సాయి హర్షిత్, భారత్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు ఐక్యంగా పోరాడాలి

దామెర : బీసీ సంఘాలు సంఘటితంగా పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ముదిరాజ్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సతీశ్ అన్నారు. మండలంలోని ఊరుగొండలో ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కల్పించి 10 శాతం ఓసీ కులాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కేంద్రం కల్పిస్తుందని గుర్తుచేశారు. బీసీ సంఘాలు, మేధావులు, యువకులు ఏకమై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రైల్వే ఏడీఆర్ఎంఓకు అభినందనలు



సంజీవరావును సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ఏడీఆర్ఎంఓగా బాధ్యతలు స్వీకరించిన ఎ.సంజీవరావును కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధికి సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కో కన్వీనర్లు పి.రమేష్, కె.సాయిరాజ్, వైస్ చైర్మన్లు పి.శ్రీనివాస్, మహేశ్, నల్లెల సోమేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌కు పరామర్శ



నయీంనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి, జర్నలిస్ట్ తోట సుధాకర్‌ను పలువురు జర్నలిస్టులు బుధవారం పరామర్శించారు. తోట సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా పాటు ఆయన సోదరులను పరామర్శించి, వెంకటమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జర్నలిస్టు నాయకులు మెండు రవీందర్, దొంతు నవీన్, పొగాకుల అశోక్, జర్నలిస్టులు ఉన్నారు.

సీజేఐపై దాడికి యత్నం హేయం



హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణస్వామి, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్లు జిలుకర శ్రీనివాస్, గంధం శివ, బొమ్మల అంబేడ్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనను ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కనీసం ఖండించకపోవడం సిగ్గుచేటని అన్నారు. నాయకులు కొంగర జగన్, కడపాక రాజేందర్, మేడ రంజిత్ కుమార్, ప్రవీణ్, దీకొండ ప్రభంజన్, దుప్పటి శుభాష్, విశ్వేశ్వర్‌రావు, నర్సన్న సాదు, జవ్వాజి కిషన్ పాల్గొన్నారు.

మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట..

కాజీపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ జి.రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కారు ఉపేందర్, జంపాల రమేష్, వెంకటస్వామి, సుధాకర్, రాయల రమ, సరోజన పాల్గొన్నారు.

ఆ న్యాయవాదిపై కేసు నమోదు చేయాలి

హసన్‌పర్తి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది రాజేష్ కిశోర్ దాడి చేయడం రాజ్యాంగంపై దాడి చేసినట్లుగా పరిగణించాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. దాడిని నిరసిస్తూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో దేవన్నపేటలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాది రాకేష్ కిశోర్‌పై ఎస్సీ, ఎస్టీ, దేశ ద్రోహి కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, డీబీఎఫ్ 65వ డివిజన్ అధ్యక్షుడు ఇనంపల్లి సదానందం, నాయకులు సుందర్‌రాజు, చుంచు కృష్ణ, కుమారస్వామి, పాల్వాన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట: ధర్నా చేస్తున్న నాయకులు



హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న నాయకులు

బీజేపీ ఓటు చోరీపై ఉద్యమిస్తాం



తూర్పుకోటలో సంతకాల సేకరణ



రామన్నపేట: కార్యక్రమంలో నాయకులు

ఖిలా వరంగల్: ఓటు చోరీపై ఉద్యమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి మద్దతుగా, టీపీసీసీ పిలుపులో భాగంగా వరంగల్ 33, 37వ డివిజన్లలోని తూర్పు కోట, శాంతినగర్‌లలో బోగి సురేష్, ముస్కమల్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లం కేశవరాజు, రాంబాబు, కర్ణాకర్, ప్రభాకర్, ప్రవీణ్, ఇట్నేని ప్రతాప్, రాణి పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

రామన్నపేట: నగరంలోని 24వ డివిజన్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సకినాల రజనీకాంత్ అధ్యక్షతన ఓటు చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా నాయకుడు గోపాల నవీన్ రాజు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తేజస్వితిరీష్, భద్రకాళి గుడి ధర్మకర్త మూగ శ్రీనివాస్, మబ్బు ప్రవీణ్, త్రిపురాని శ్రీనివాస్, కాసుల సురేష్, గంప రాము, చాగంటి కిరణ్ కుమార్, సంజీవరెడ్డి, పృథ్వీ, శ్రవణ్, మాగంటి ముకేష్, మాగంటి రాజకుమార్, రాయబారం జనార్థన్, బెజగం రజనీకాంత్, పంతగాని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తా: సంతకాల సేకరణ పత్రాలను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

27వ డివిజన్‌లో..

వరంగల్ చౌరస్తా: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు వరంగల్ 27వ డివిజన్ కూరగాయల మార్కెట్ బొడ్రాయి ప్రాంతంలో ఓటు చోరీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ నాయకులు భాషపాక సదానందం, ఎర్రం కమల్, గూడ రమ్య, సందెల లాజర్, జన్ను జీవన్, మంద శ్రీనివాస్, పాలెపాక విశాల్ బాబు, కొమ్ము అమర్, పోలెపాక యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న వడ్డేపల్లి గ్రామస్తులు
- బతుకమ్మ బండను కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీ శివారులో రూ.3 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకోవడానికి చేసిన ప్రయత్నాలను వడ్డేపల్లి గ్రామస్తులు తిప్పి కొట్టారు. ప్రశాంత్‌నగర్ కాలనీ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న 690 సర్వే నంబర్‌లో దాదాపు 33 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని వడ్డేపల్లి వాసులు బతుకమ్మ బండగా పిలుస్తూ నాలుగు దశాబ్దాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. పుష్కర కాల క్రితం ఆ బతుకమ్మ కుంటను ఆక్రమించుకోవడానికి కొంతమంది కబ్జాదారులు ప్రయత్నించగా అప్పట్లో సాక్షి పత్రికలో వచ్చిన ప్రత్యేక కథనాలకు రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాదారుల చెర నుంచి విడిపించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొంటూ స్థలం చుట్టూ రెవెన్యూ అధికారులు సిమెంట్ దిమ్మెలను నిర్మించారు. ఆ స్థలంలో బతుకమ్మ ఆడుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల ఆ స్థలంపై కన్నేసిన కొంతమంది కబ్జాదారులు.. జేసీబీల సహాయంతో ప్రభుత్వ అధికారులు నిర్మించిన సిమెంట్ దిమ్మెలను కూల్చివేసి ఆక్రమించుకోవడానికి యత్నించారు. కబ్జాదారులపై గ్రామస్తులు తిరగబడడంతో చేసేదేమీలేక పలాయనం చిత్తగించారు. 33 గుంటల స్థలాన్ని ఇప్పటికే కొంతమంది ఆక్రమించుకోవడంతో బతుకమ్మ బండ కుచించుకపోయింది. మళ్లీ కొంతమంది తప్పుడు కాగితాలు సృష్టించి కబ్జాకు యత్నిస్తున్నట్లు కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.



ప్రశాంత్‌నగర్‌లో కబ్జాదారులు కన్నుపడిన స్థలం